

**జీవన 'యోగ'ం**
యోగా నేడు ప్రపంచదేశాల్లో వేగంగా విస్తరించింది. ప్రతిఒక్కరూ వ్యాయామంలో యోగాను భాగం చేసుకుంటున్నారు. నేడు ప్రపంచ యోగా దినోత్సవం. 8లో▸



**'నానో'పై విముఖత**
రెండేళ్ల క్రితం మార్కెట్‌లోకి వచ్చిన నానో యూరియా వినియోగంపై రైతులు ఆసక్తి చూపడం లేదు. అవగాహన లేక చాలామంది ఇప్పటికీ దానిని వాడటం లేదు. 9లో▸

గరిష్టం/కనిష్టం
33.4 /26.5

**వాతావరణం**
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాలు, ఉపరితల ద్రోణి ప్రభావంతో జిల్లాలో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### 'కాగజ్‌నగర్'కు సబ్‌కలెక్టర్ హోదా

- ఉమ్మడి జిల్లాలో మరో మూడు..
- భైంసా, బెల్లంపల్లి, ఉట్నూర్ కూడా..
- ఆర్డీవో స్థానంలో ఐఏఎస్ అధికారి

భైంసాటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్ కేంద్రాలైన కాగజ్‌నగర్, ఉట్నూర్, భైంసా, బెల్లంపల్లికి సబ్ కలెక్టర్‌స్థాయి హోదా దక్కాయి. ఆర్డీవో స్థానంలో ఐఏఎస్ కేడర్ అధికారిని నియమించాలని నిర్ణయిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఉట్నూర్, భైంసా, కాగజ్‌నగర్, బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్లకు గాను ఇప్పటివరకు ఆర్డీవో స్థాయి అధికారి ఉండగా, ఇకపై ఐఏఎస్ అధికారి సబ్ కలెక్టర్‌గా ఉండనున్నారు. పరిపాలన ఆవశ్యకతలో భాగంగా రాష్ట్రంలోని 15 రెవెన్యూ డివిజన్లలో ఐఏఎస్ అధికారులను సబ్ కలెక్టర్లుగా నియమించడానికి ప్రభుత్వం సాధారణ పరిపాలన విభాగం ద్వారా జీవో 834ను తేదీ 13.06.2024న జారీ చేసింది.

### ఐఎఫ్‌ఎంఎస్ పోర్టల్‌లో 'ఆధార్' నమోదు చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని డ్రాయింగ్ అండ్ డిస్బర్‌మెంట్ అధికారులు తమ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగుల ఆధార్ నంబర్‌ను ఐఎఫ్‌ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా కోశాధికారి జాడి రాజేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకు ముందే ఐఎఫ్‌ఎంఎస్ పోర్టల్‌లో ఆధార్ నంబర్ నమోదైతే మరోసారి సరి చూసుకోవాలని సూచించారు. జూన్ వేతనం బిల్లుతోపాటు ఆధార్ నమోదుకు సంబంధించిన సర్టిఫికెట్ జత చేయాలని పేర్కొన్నారు. సర్టిఫికెట్ నమూనా జిల్లా కేంద్రంలోని ఖజానా కార్యాలయంలో అందుబాటులో ఉందని, జూన్ 25లోగా సంబంధిత డ్రాయింగ్ అండ్ డిస్బర్‌మెంట్ అధికారులు నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు.


### కూరగాయలు, పండ్ల తోటలు సాగు చేయాలి



తోటను పరిశీలిస్తున్న జిల్లా అధికారి

చింతలమానెపల్లి(సిర్పూర్): రైతులు సాధారణ పంటలతోపాటు కూరగాయలు, పండ్ల తోటలు సాగు చేయాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి ఎం.వెంకటేశం అన్నారు. మండలంలోని డబ్బా, గంగాపూర్ గ్రామాల శివార్లలోని ఆయిల్‌పామ్ తోటలను గురువారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. తోటలు సాగు చేస్తున్న రైతులకు సూచనలు చేశారు. కలుపు నివారణ, ఎరువుల వినియోగం సకాలంలో చేపట్టాలని సూచించారు. సాగుదారులకు అన్ని వేళలా సలహాలు, సూచనలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఆయన వెంట హార్టికల్చర్ అధికారి శాంతిప్రియ, ఇరిగేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, రైతులు ఉన్నారు.

### స్కాలర్‌షిప్‌కు ఎంపిక



ఎంపిక పత్రం ఇస్తున్న ప్రిన్సిపాల్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు జేఈటీ సూపర్ 20 స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు భావన, మనస్విని, దీపికకు గురువారం పాఠశాల ఆవరణలో సంస్థ డైరెక్టర్ అరుణ్‌తో కలిసి స్కాలర్‌షిప్ పత్రాలు అందించి అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జటాధరా ఎడ్యుకేషన్ టెక్నాలజీ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సూపర్ 20 స్కాలర్‌షిప్ కోసం 20 మంది పదో తరగతి పాసైన విద్యార్థులను ఎంపిక చేశారని తెలిపారు. ఇందులో ముగ్గురు మోడల్ స్కూల్ విద్యార్థులు ఉండటం సంతోషకరమన్నారు. విద్యార్థులకు రెండేళ్లు ఐఐటీ, జేఈఈ పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత కోచింగ్ అందిస్తారని తెలిపారు.

# ఉన్నట్టా.. లేనట్టా..!



ఆసిఫాబాద్ మండలం ఈదులవాడ చెరువులో చేపపిల్లలు విడుదల చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు(ఫైల్)

- ఉచిత చేపపిల్లల పంపిణీపై నీలినీడలు
- జూన్ వచ్చినా ఖరారు కాని టెండర్ ప్రక్రియ
- ఇప్పటికీ స్పష్టతనివ్వని రాష్ట్ర ప్రభుత్వం
- ఆందోళన చెందుతున్న మత్స్యకారులు

ఆసిఫాబాద్: మత్స్యకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 2016లో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేపపిల్లల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఏటా వర్షాకాలంలో టెండర్ ప్రక్రియ నిర్వహించి గుర్తించిన జలాశయాల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపపిల్లలు విడుదల చేసేవారు. చేపలు పెరిగిన సమయంలో మత్స్యకారులు వాటిని అమ్ముకుని ఉపాధి పొందేవారు. అయితే ఈ ఏడాది వర్షాకాలం వచ్చినా ఇప్పటివరకు చేపపిల్లల పంపిణీపై స్పష్టత రావడం లేదు. రాష్ట్రంలో నూతనంగా కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు ఇప్పటివరకు టెండర్ల ప్రక్రియ నిర్వహించి ధరలు ఖరారు చేయలేదు. ప్రతీ సంవత్సరం ఆంధ్రప్రదేశ్‌లోని కాంట్రాక్టర్ల వద్ద నుంచి విత్తన చేప పిల్లలను కొనుగోలు చేసేవారు. కొన్ని జిల్లాల్లో మాత్రం మత్స్యశాఖ ఆధ్వర్యంలోని ఉత్పత్తి కేంద్రాల్లో చేపపిల్లలు ఉత్పత్తి చేసేవారు. కానీ ఆ జాబితాలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా లేకపోవడంతో తప్పనిసరిగా ఇతర ప్రాంతాల నుంచి చేపపిల్లలు తెప్పించాల్సిందే. దీనికి సంబంధించిన టెండర్ ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

**జిల్లా నుంచి చేపల ఎగుమతి**

జిల్లాలోని కుమురంభీం, వట్టివాగు జలాశయాలతోపాటు చెరువుల్లో ఏటా మత్స్యశాఖ ఉచిత చేపపిల్లలు విడుదల చేస్తున్నారు. 2022లో 1,35,81,000 చేప పిల్లలు, 2023లో 1,38,51,000 చేప పిల్లలు విడుదల చేశారు. జలాశయాల్లో వదిలిన చేపపిల్లలు 8 నెలల్లో అర కిలో నుంచి ముప్పావు కిలో వరకు సైజు పెరుగుతాయి. జలాశయాల్లోని చేపలను మత్స్యకారులు జిల్లా కేంద్రంతోపాటు కాగజ్‌నగర్, మంచిర్యాల, మహారాష్ట్రలోని చంద్రపూర్, బల్లార్షా ప్రాంతాలకు తరలించి మార్కెటింగ్ చేస్తున్నారు. కిలో చేపలు రూ.200 వరకు విక్రయిస్తున్నారు. దీని ద్వారా మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతమవుతున్నారు. విడుదలలో జాప్యం జరిగితే సైజు పెరగడం కష్టమవుతుందని, ప్రభుత్వం దృష్టి సారించి చేపపిల్లల పంపిణీకి చర్యలు చేపట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు.

**మత్స్యకారులకు ఉపాధి**

రాష్ట్రంలో విస్తృతమైన నీటి వనరులు అందుబాటులో ఉన్న నేపథ్యంలో మత్స్యకారులకు ఉపాధి కల్పించి వారి కుటుంబాలకు చేయూతనివ్వాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం 2016లో ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. జిల్లాలో 60 వరకు మత్స్యకార సంఘాలు ఉండగా, వీటి పరిధిలో దాదాపు 5000 మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఆయా సంఘాలకు చేపల పెంపకానికి అవసరమైన సామగ్రిని సబ్సిడీపై అందిస్తున్నారు. అలాగే స్థానిక జలాశయాల్లో పెంచేందుకు అవసరమైన చేపపిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలోని కుమురంభీం, వట్టివాగు, పీపీరావు, ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్టులతోపాటు పది పెద్ద చెరువుల్లో ఏటా సుమారు రూ.1.30 కోట్ల విలువ చేసే చేపపిల్లలను టెండర్ల ద్వారా కొనుగోలు చేసి విడుదల చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అట్టహాసంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేవారు. గతంలో ఏప్రిల్‌లో ప్రకటన విడుదల చేస్తే.. మేలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసేవారు. జూన్ నాటికి చేపపిల్లలు సిద్ధం చేసేవారు. వర్షాల పడి జలాశయాలు, చెరువులు నిండగానే వాటిని విడుదల చేసేవారు. ఈ ఏడాది ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో చేపల పెంపకంపై ఆధారపడిన మత్స్యకారుల పరిస్థితి ఇబ్బంది మారింది. కాగా అధికారులు మాత్రం ఎన్నికల కోడ్‌తో ప్రక్రియ ఆలస్యమైందని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే టెండర్ల ప్రక్రియ చేపడతామని చెబుతున్నారు.

**ఉపాధి కోల్పోతారు**

ఈ ఏడాది కూడా కొత్త ప్రభుత్వం జిల్లాలోని జలాశయాల్లో నాణ్యమైన ఉచిత చేపపిల్లలు విడుదల చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలు విడుదల చేయకుంటే మత్స్యకారులు ఉపాధి కోల్పోతారు. ప్రభుత్వం పథకాన్ని యథావిధిగా కొనసాగించాలి.

– ఇస్తారి, మత్స్యకార సంఘం డైరెక్టర్, బెజ్జూర్

**ప్రభుత్వ నిర్ణయం మేరకే..**

ఉచిత చేపపిల్లల పంపిణీపై ఎన్నికల కోడ్ ఉండడంతో ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. టెండర్లు ఖరారు కాగానే జలశయాల్లో చేపపిల్లలు విడుదల చేస్తాం.

– సాంబశివరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

## నులిపురుగుల నివారణకు కృషి చేయాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



విద్యార్థికి మాత్ర వేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల్లో నులిపురుగుల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం విద్యార్థులకు డీఎంహెచ్‌వో తుకారాం భట్‌తో కలిసి విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,73,494 మంది ఏడాది నుంచి 19 ఏళ్ల బాలబాలికలు ఉన్నారని, వీరందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలన్నారు. చిన్నారులపై నులిపురుగుల ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. మట్టిలో ఆడుకోవడం, పాఠశాలల్లో చాక్‌పీస్, బలపాలు, మట్టి తినడం వంటి కారణాలతో పిల్లల శరీరంలోకి నులిపురుగులు ప్రవేశిస్తాయని తెలిపారు. దీంతో వారిలో రోగ నిరోధక శక్తి లోపించి అనారోగ్యం బారిన పడతారని పేర్కొన్నారు. అల్బెండజోల్ మాత్రలు వేయించడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, ప్రిన్సిపాల్ శ్రీనాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

**విద్యార్థులు ఇష్టపడి చదవాలి**

విద్యార్థులు ఇష్టపడి చదవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు గురువారం పాఠ్య పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందన్నారు. విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

## అనుమతులకు లోబడి పనులు చేపట్టాలి

- ఐఆర్‌వో త్రినాథ్



అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఐఆర్‌వో త్రినాథ్, జిల్లా అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్/రెబ్బెన: కేంద్ర ప్రభుత్వ అనుమతులకు లోబడి సింగరేణి ఓపెన్ కాస్టు పనులు చేపట్టాలని కేంద్ర పర్యావరణ శాఖ చెందిన ఇండియన్ రీజినల్ మేనేజర్ త్రినాథ్ అన్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్, తిర్యాణి, రెబ్బెన అటవీ రేంజ్‌ల పరిధిలోని గోలేటి ఓసీపీ, డోర్లి ఓసీపీ, డీగ్రేడెడ్ అటవీ ప్రాంతంతోపాటు అటవీశాఖకు బదిలీ అయిన రెవెన్యూ భూములను గురువారం కాళేశ్వరం ఎఫ్‌టీపీటీ శాంతారాం, జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఐఆర్‌వో మాట్లాడుతూ గోలేటి ఉపరిత బొగ్గు గనుల్లో భాగంగా 615 హెక్టార్ల అటవీ భూమి బదిలీ అనుమతుల కోసం ప్రతిపాదనలు వచ్చినట్లు తెలిపారు. దీని కోసం డోర్లిలో ఇప్పటికే మూసివేసిన సింగరేణి గనుల ప్రాంతాన్ని అటవీశాఖకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. అనుమతుల కోసం ఇచ్చిన ప్రతిపాదనలకు మించి ఎక్కువ అటవీభూమి బదిలీ కాకుండా అధికారులు చూడాలన్నారు. సింగరేణి అధికారులతో అటవీశాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ భూముల బదిలీ కార్యక్రమం చేపట్టాలని సూచించారు. వారి వెంట బెల్లంపల్లి ఏరియా సింగరేణి జీఎం రవి ప్రసాద్, ఎఫ్ఆర్‌వోలు అప్పలకొండ, శ్రీనివాస్, శ్రీధరచారి, సుభాష్, బెల్లంపల్లి ఎఫ్‌డీవో విజయ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

## ఐఐటీ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం



అర్జున్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ప్రతిభ చూపిన మండల కేంద్రానికి చెందిన దుర్గం అర్జున్‌ను ఎమ్మెల్యే కోవ లక్ష్మి గురువారం ఆసిఫాబాద్‌లో శాలువాతో సన్మానించి అభినందించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 1782వ ర్యాంకు సాధించి తిరుపతి ఐఐటీలో సీటు సాధించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా అర్జున్‌కు రూ.35 వేల ఆర్థికసాయం అందించారు. చదువు పూర్తయ్యే వరకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఉన్నత చదువు పూర్తి చేసి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, అధ్యాపకులు చంద్రయ్య, కిరణ్, రాజమౌళి, సంతోష్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు పూలబొకే అందిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్‌కు పూలమొక్క ఇస్తున్న ఎస్పీ

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు
- జిల్లా కేంద్రంలో బాధ్యతలు స్వీకరణ

ఆసిఫాబాద్: జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ నుంచి బదిలీపై జిల్లాకు వచ్చిన ఆయన గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, పోలీసు అధికారులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. మేడ్చల్ జిల్లా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న డీవీ శ్రీనివాసరావు 2013 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. 2007లో గ్రూప్ -1 సర్వీస్ ద్వారా కరీంనగర్ డీఎస్పీగా ఉద్యోగం సాధించారు. మహబూబ్‌నగర్ అడిషనల్ ఎస్పీగా, రాచకొండ కమిషనరేట్‌లో అడ్మిన్‌గా, నల్గొండ జిల్లాలో విజిలెన్స్ శాఖ ఎస్పీగా విధులు నిర్వహించారు. గురువారం జిల్లా కేంద్రంలో ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజల భద్రత, రక్షణే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని, ప్రజలకు పోలీసులు అందుబాటులో ఉండాలన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, వాటి కట్టడిపై జాగ్రత్తలు తీసుకోవాలని, డయల్ 100 ద్వారా వచ్చిన ఫోన్ కాల్స్‌కు వేగంగా స్పందించి నేరాన్ని నియంత్రించాలన్నారు. సైబర్ నేరాల కట్టడికి ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, నిషేధిత మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. మావోయిస్టు నియంత్రణకు జిల్లాలో ఎప్పటికప్పుడు స్పెషల్‌పార్టీ ద్వారా ఏరియా డామినేషన్, కూంబింగ్ నిర్వహించాలని ఆదేశించారు. సామాన్యులను దృష్టిలో ఉంచుకుని పోలీసింగ్ ఉంటుందని, శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని, సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా చెడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్వేషాలను రెచ్చగొట్టే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. శాంతిభద్రతల పరిరక్షణకు సమష్టిగా కలిసి పని చేద్దామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ పార్టీ నాయకులతో కలిసి ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

## 'బడిబాట' పట్టారు

- విజయవంతంగా ముగిసిన కార్యక్రమం
- ప్రభుత్వ పాఠశాలల్లో 1512 మందికి అడ్మిషన్లు



కెరమెరి మండలం ఝరిలో నూతనంగా బడిలో చేరిన విద్యార్థులు

**నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థుల వివరాలు**

| | |
|---|---|
| అంగన్‌వాడీ కేంద్రాల నుంచి | 1,160 |
| నేరుగా పాఠశాలల్లో అడ్మిషన్లు | 157 |
| ప్రైవేట్ స్కూళ్ల నుంచి | 152 |
| బడిబయట పిల్లలు | 43 |

కెరమెరి(ఆసిఫాబాద్): బడిబాట కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా ముగిసింది. ఎండలు, ఉక్కపోతతో ఇబ్బందిపడిన ఉపాధ్యాయులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు ప్రవేశాలు కల్పించారు. సర్కారు బడుల్లో వసతులను పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. ఈ నెల 19 వరకు సాగిన బడిబాట కార్యక్రమంలో మొత్తం 1512 మందికి నూతనంగా పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించారు.

**అందరి భాగస్వామ్యం..**

గత అనుభవాల దృష్ట్యా విద్యాశాఖ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. మొదట ఈ నెల 3 నుంచి కార్యక్రమం ప్రారంభించాలని నిర్ణయించినా.. ఎండలు, ఇతర కారణాలతో 6వ తేదీ నుంచి 19 వరకు చేపట్టారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులతోపాటు జిల్లా అధికారులు సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఎంపీడీవోలు, తహసీల్దార్లు, అసిస్టెంట్ లేబర్ అధికారులు, స్టేషన్ హౌజ్ అధికారులు, ఎన్‌జీవోలు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, మహిళా శిశు సంక్షేమశాఖ సూపర్‌వైజర్లు, వీవో సభ్యులను భాగస్వాములను చేశారు. జిల్లాలో మొత్తం 738 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ బడుల్లో అందిస్తున్న ఇంగ్లిష్ మీడియం బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, మధ్యాహ్న భోజనం, వసతుల గురించి విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రైవేట్ పాఠశాలలతోపాటు బడి బయట పిల్లలను సర్కారు బడుల వైపు మళ్లించాలనే లక్ష్యంతో ముందడుగు వేశారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ప్రాథమిక పాఠశాలలపై దృష్టి సారించారు. అక్కడి విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్ల వైపు వెళ్లకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి వివరాలు సేకరించారు. బడిబయట పిల్లలను గుర్తించి నేరుగా అడ్మిషన్లు కల్పించారు.

**అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల కీలకపాత్ర**

బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు వివిధ సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో ఇంటింటా విస్తృత ప్రచారం చేశారు. కరపత్రాలు పంపిణీ చేశారు. అయితే ఎస్‌ఎంసీల స్థానంలో నియమించిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు బడిబాట కార్యక్రమం విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిటీల ఆధ్వర్యంలోనే పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టడంతోపాటు విద్యార్థులకు యూనిఫాం కుట్టిస్తున్న విషయం తెలిసిందే. దీంతో మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వ పాఠశాలలకు చిన్నారులు వచ్చే విధంగా తల్లిదండ్రులకు ప్రేరణ కల్పించారు.

**పోర్టల్‌లో వివరాల నమోదు**

రాష్ట్ర వ్యాప్తంగా బడిబాట కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా, పట్టణ, గ్రామస్థాయిలో విద్యార్థుల వివరాలను ఉపాధ్యాయులు ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. నూతనంగా అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులు అంగన్‌వాడీ కేంద్రాల నుంచి వచ్చారా..? ప్రైవేట్ స్కూళ్ల నుంచి వచ్చారా.. నేరుగా అడ్మిషన్లు తీసుకున్నారా..? అనే విషయాలను ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు బడిబాట పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. దీని ద్వారా జిల్లాస్థాయి అధికారులకు మానిటరింగ్ చేయడం సులువైంది. జిల్లా విద్యాధికారి పూర్తి వివరాలను రాష్ట్ర పాఠశాల విద్యాధికారులు, ప్రాజెక్టు అధికారులకు నివేదించారు.

**డ్రాపౌట్స్ లేకుండా చర్యలు**



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు జిల్లాలో బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాం. వేసవి సెలవుల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు తుదిదశకు చేరాయి. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్స్ లేకుండా చర్యలు చేపడతాం.

–పి.అశోక్, జిల్లా విద్యాధికారి

## ఆ టీచర్ డిప్యూటేషన్ రద్దు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎట్టకేలకు ఆ ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ రద్దయింది. ఈ నెల 19న 'ఏంటి గురూ.. ఇదీ!' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తాండూరు జెడ్పీ సెకండరీ స్కూల్‌లో ఫిజికల్ సైన్స్ టీచర్‌గా ఉంటూ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కో ఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎం.భరత్‌కుమార్ డిప్యూటేషన్ రద్దు చేస్తూ మంచిర్యాల జిల్లా విద్యాధికారి యాదయ్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా విద్యాధికారి వినతి మేరకు రెండుసార్లు డిప్యూటేషన్ పొడగించామని, తాండూరు స్కూల్‌లో ఆయన సేవలు అవసరమని వెంటనే ఆ ఉపాధ్యాయుడి రిలీవ్ చేయాలంటూ కోరారు. మరోవైపు అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల్లో కమీషన్ల కోసమే ఇన్నాళ్లు డిప్యూటేషన్‌ను ఉన్నతాధికారులు పొడగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నట్లు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

సాక్షి స్పందన



మంచిర్యాల డీఈవో యాదయ్య జారీ చేసిన ఉత్తర్వు

## ఇళ్ల నిర్మాణాలకు అనుమతి తప్పనిసరి

- డీపీవో భిక్షపతి

కాగజ్‌నగర్‌రూరల్: గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతి తప్పనిసరి అని డీపీవో భిక్షపతి అన్నారు. మండలంలోని నాగంపేట పంచాయతీ పరిధిలోని సెగ్రిగేషన్ షెడ్డు, శ్మశానవాటికను గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీలకు విడుదలైన నిధులు, ఇంటి పన్నుల వివరాలు తప్పనిసరిగా రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. అనంతరం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు. ఆయన వెంట ఎంపీవో గౌరీశంకర్, ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ సరస్వతి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి తదితరులు ఉన్నారు.

# జీవన 'యోగ'ం


యోగా ఆసనాలు వేయిస్తున్న శిక్షకుడు తిరుపతిరెడ్డి

- నిత్య సాధనతో ఆరోగ్యం
- నేడు ప్రపంచ యోగా దినోత్సవం

ఆదిలాబాద్/మంచిర్యాలటౌన్/నిర్మల్‌ఖిల్లా: భారతీయ సనాతన సంస్కృతికి ఎంతో విశిష్టత ఉంది. యోగ భారతదేశంలో పుట్టి నేడు ప్రపంచదేశాల్లో కూడా వేగంగా విస్తరించింది. ప్రతి ఒక్కరూ వ్యాయామంలో యోగనే ఆదర్శంగా తీసుకుంటున్నారంటే అదీ మన భారతదేశ గొప్పతనం. దీన్ని ప్రపంచ దేశాలు గుర్తించడంతో ఐక్యరాజ్య సమితి 2015 నుంచి జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించింది. జూన్ 21న సూర్యుడు భూమధ్య రేఖకు దూరంగా వెళ్తాడు. ఆ రోజున దినంలో సమయం కొద్దిగా ఎక్కువగా ఉంటుంది. ఇదే రోజును ప్రపంచ యోగా దినోత్సవంగా నిర్ణయించడానికి ఒక కారణంగా చెప్తారు. మనసును నిగ్రహపరచడం, శారీరక, మానసిక ఆరోగ్యంపై పట్టు సాధించాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ యోగాకు ప్రాధాన్యత ఇస్తున్నారు. నేడు ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

**ఆసనాలు..**

వివిధ రకాల ఆసనాల ద్వారా పలు ప్రయోజనాలు ఉన్నాయి. ప్రాణాయామం, వృక్షాసనం, వీరభద్రాసనం, పశ్చిమోత్తాసనము, గోముఖాసనము, శీర్షాసనం, పూర్ణ శలభాసనం, చక్రాసనం ఆసనాల ద్వారా రక్తశుద్ధి, నరాలకు బలం చేకూర్చడం, పొట్ట తగ్గడం, బరువు తగ్గడం వంటి ప్రయోజనాలు ఉన్నాయని శిక్షకులు సూచిస్తున్నారు.


యోగా నేర్పిస్తున్న సంధ్య బెదోద్కర్


శిక్షణ ఇస్తున్న శిక్షకుడు సంతోష్

## ఐదేళ్లప్రాయం నుంచే...



నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రంలోని వెంకటాద్రిపేట్‌కు చెందిన ద్యావరశెట్టి చైతన్య తన తండ్రి ప్రభాకర్ చేస్తున్న యోగాసనాలను చూస్తూ పెరిగింది. ప్రభాకర్ నిజామాబాద్‌లో యోగాచార్యులుగా గుర్తింపు పొందారు. ఐదేళ్లకే చైతన్య ఆసనాలు వేయడం ఆరంభించింది. యోగ విద్యలో పట్టు సాధించడమే కాకుండా పట్టా కూడా పొందేందుకు 2008లో నాసిక్‌లోని యశ్వంత్‌రావు చౌహాన్ యూనివర్సిటీ నుంచి డిప్లొమా ఇన్ యోగా పూర్తిచేసింది. భర్త ద్యావరశెట్టి వేణుగోపాల్ సహకారంతో ప్రస్తుతం యోగాసాధన కొనసాగిస్తోంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ పతకాలనూ సాధించింది. మాజీ ఎంపీ మధుయాష్కీ చేతుల మీదుగా ఉత్తమ యోగా ప్రదర్శకురాలిగా అవార్డునూ పొందారు.

## ఉచితం.. సమాజ'హితం'..



నిర్మల్‌ఖిల్లా: 2006 నుంచి యోగా సాధన చేస్తున్నాను.. గతంలో ఆదిలాబాద్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో అనుకోకుండా జరిగిన ప్రమాదంలో తలలో రక్తం గడ్డ కట్టిందని డాక్టర్లు చెప్పారు. అప్పుడు రాందేవ్ బాబా స్ఫూర్తితో యోగా అలవాటు చేసుకున్నాను. ఆసనాలు, ప్రాణాయామ, సూర్య నమస్కారాలు ప్రతీరోజు రెండు గంటలు చేస్తున్నాను. అనంతరం గడ్డకట్టిన రక్తం క్రమంగా సాధారణ స్థితికి వచ్చిందని డాక్టర్లు తెలిపారు. అప్పటినుండి మరింత ఉత్సాహంగా క్రమం తప్పకుండా యోగా చేస్తున్నాను. నేను చేయడమే కాకుండా నా వద్దకు వచ్చే మరో వంద మందికి ఉచితంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్యనగర్ లోని వశిష్ట యోగా సంఘటన్‌లో ఉదయం శిక్షణ ఇస్తున్నాను. – జంగిలి బాలాజీ యాదవ్, యోగా శిక్షకులు, నిర్మల్

## దినచర్యలో ఒక భాగం చేసుకోవాలి



మన దినచర్యలో యోగాను ఒక భాగం చేసుకోవాలి. ఏదో ఒక ఆరోగ్య సమస్యతో ప్రతి ఒక్కరూ బాధపడుతున్నారు. ప్రతిరోజు యోగా చేయడంతో ఆరోగ్యంగా ఉంటారు. ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులు దరిచేరవు. ఏ వ్యాధికి సంబంధించిందైనా పూర్తిగా అదుపులో ఉంచేందుకు, ఆ వ్యాధులను తగ్గించేందుకు యోగ ఉపయోగపడుతుంది. ధ్యానం, ప్రాణామాయం వంటివి ఒత్తిడిని దూరం చేయడంతోపాటు రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరు సునాయాసంగా చేసేందుకు యోగా ఉపయోగపడడంతోపాటు చిన్నారుల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రతను పెంపొందిస్తుంది. యోగ ఆసనాలను ఇష్టం వచ్చినట్లు వేయకుండా శిక్షకులు చెప్పిన పద్ధతిలో వేయాలి. – గోనె మణిమాల, యోగా శిక్షకురాలు, మంచిర్యాల

## విస్తృత ప్రయోజనాలు



యోగా సాధన మనిషి జీవితంలో గణనీయమైన మార్పులను తీసుకువస్తుంది. ఇది కేవలం శారీరక వ్యాయామానికి మాత్రమే పరిమితం కాదు. విస్తృత ప్రయోజనాలు ఉంటాయి. నిరంతర సాధనతో ప్రశాంతత చేకూరుతుంది. తన లోని అంతరంగాన్ని చదివే దిశగా మనిషిని ప్రేరేపిస్తుంది. చిన్నారులు మొదలుకొని వృద్ధుల వరకు చేయవచ్చు. ముఖ్యంగా నేటి యువత యోగా సాధన అలవర్చుకోవాలి. – సంధ్య బెదోద్కర్

## పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నా..



నిత్యజీవితంలో పెరిగిన ఒత్తిడితో పాటు ఉద్యోగ, కుటుంబ బాధ్యతలతో శారీరక, మానసిక రుగ్మతలు పెరిగిపోతున్నాయి. రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నా కొన్నిసార్లు దీర్ఘకాలిక వ్యాధులు అదుపు చేసుకోలేని పరిస్థితి. ఈ క్రమంలో వ్యాధుల నియంత్రణకు, మానసిక దృఢత్వం సాధించేందుకు యోగా ఎంతగానో దోహదపడుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో సాధనతో ప్రతి ఒక్కరిలో ఉత్తేజం నింపుతుంది. శరీరం, మనస్సుపై అదుపు ఏర్పడుతుంది. భారతీయ సంస్కృతి ప్రసాదమైన యోగా పలువురికి నేర్పిస్తుండడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. – తిరుపతిరెడ్డి, యోగా శిక్షకుడు, పతంజలి యోగా భవన్

## ప్రపంచవ్యాప్తంగా ఆదరణ



యోగాకు దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పెరుగుతుంది. దీనిని ఒక క్రీడగా గుర్తించడంతో ఈ కోర్సులకు డిమాండ్ పెరుగుతుంది. భవిష్యత్తులో ఒలంపిక్ క్రీడల్లో సైతం దీన్ని చేర్చే అవకాశాలు ఉన్నాయి. ఆరోగ్యంతో పాటు ఉపాధి సైతం యోగా ద్వారా సాధ్యమవుతుంది. చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే విధంగా పాఠ్యపుస్తకాల్లో యోగాను చేర్చడం శుభ పరిణామం. అలాగే పాఠశాలల్లో ప్రత్యేకంగా సమయం కేటాయిస్తుండడం దీనికి పెరుగుతున్న మద్దతుకు సంకేతంగా నిలుస్తుంది. యోగాతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. – సంతోష్, యోగా శిక్షకుడు, ఆదిలాబాద్

## ఏకాగ్రత పెరుగుతుంది..



చెన్నూర్: వేసవి సెలవుల్లో యోగా నేర్చుకున్నా. యోగా క్లాసుల ద్వారా ఏకగ్రత పెరుగుతుంది. గత ఏడాది నుంచి యోగా శిక్షణ పొందుతున్నా. జ్ఞాపక శక్తి పెరిగింది. ఎండకాలంలో సెలవులను యోగా శిక్షణ తరగతులతో గడిపాను. -బి.రుత్విక్, విద్యార్థి

## ఆసనాలు నేర్చుకున్నా..



చెన్నూర్: మొదట యోగా ఆసనాలు వేయాలంటే కష్టంగా ఉండే. ప్రతీరోజు క్లాస్‌లకు వచ్చాను. ప్రస్తుతం నాకు అన్ని రకాల యోగా ఆసనాలు వేయడం వచ్చు. ఎలాంటి ఫీజు తీసుకోకుండా గత నాలుగేళ్ల నుంచి యోగా శిక్షణ ఇస్తున్నారు. -గంగుల జస్విత, విద్యార్థిని, చెన్నూర్

## పది మందికి నేర్పించాలని..



చెన్నూర్: నేను నేర్చుకున్న యోగా వృథా కావద్దనే ఉద్దేశంతో పది మందికి నేర్పిస్తున్నా. గత నాలుగేళ్ల నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నా. ఉదయం ఒక బ్యాచ్, సాయంత్రం ఒక బ్యాచ్ చొప్పున చాలామంది వస్తున్నారు. ప్రతి ఒక్కరూ యోగాను అభ్యసించాలి. -మంచాల పద్మజ, యోగా శిక్షకురాలు, చెన్నూర్

## క్లుప్తంగా

### విద్యుదాఘాతంతో రెండు పశువులు మృతి


భీమారంలో మృతిచెందిన పశువులు

భీమారం: మండల కేంద్రంలోని కొత్తగూడెం సమీపంలో ఉన్న బాల్‌రెడ్డి కొట్టం వద్ద బూపల్లి లచ్చన్న, పల్ల శ్రీనివాస్‌కు చెందిన రెండు పశువులు ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ తగిలి మృతిచెందాయి. మూడు రోజుల క్రితం మేతకు వెళ్లిన పశువులు ఇంటికి రాకపోవడంతో గాలిస్తున్నారు. గురువారం ఉదయం స్థానికుల సమాచారం మేరకు వెళ్లి చూడగా విద్యుదాఘాతంతో మృతిచెంది ఉన్నాయి. ఒక్కోదాని విలువ రూ.75 వేలు ఉంటుందని, విద్యుత్‌శాఖ అధికారులు పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన అవదూత భాస్కర్ (30) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడని పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కూలీ పనిచేసుకుని జీవించే భాస్కర్ మద్యానికి బానిసగా మారాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య నిహారిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

### తుంపెల్లిలో మహిళపై దాడి

ఆసిఫాబాద్అర్బన్: మండలంలోని తుంపెల్లి గ్రామంలో మహిళపై అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దాడి చేశారు. బాధితురాలు పోలవేణి అంకు గురువారం వివరాలు వెల్లడించారు. ఉపాధిహామీ పనులకు వెళ్లి వస్తుండగా ఇంటి సమీపంలో హద్దుల ఏర్పాటు కోసం ఉంచి ఫెన్సింగ్ వైర్‌ను పోలవేణి హనుమంతు తొలగించాడని ఆరోపించింది. అంతేకాక హద్దులోపల కొత్తగా కర్రలతో దడి ఏర్పాటు చేయడంపై ఇదేంటని ప్రశ్నించానని పేర్కొన్నారు. దీంతో హనుమంతు, అతడి అల్లుడు భావినె పర్వతాలు కర్రలతో దాడి చేశారని ఆరోపించింది. అడ్డుకునేందుకు ప్రయత్నించిన తన పెద్దకుమారుడు బీరయ్యను సైతం కొట్టి బూతులు తిట్టినట్లు తెలిపింది. ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, తనకు న్యాయం చేయాలని కోరింది.

### పరిహారం పెంచాలని కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న భూనిర్వాసితులు

జైపూర్: మండలంలోని నర్వ నుంచి ఎల్కంటి, షెట్‌పల్లి, నర్సింగాపూర్, కుందారం, కిష్టాపూర్, వేలాల, పొనూర్ మీదుగా నూతనంగా నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు కింద నష్టపోతున్న భూములకు పరిహారం పెంచాలని రైతులు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను కోరారు. గురువారం భూములు కోల్పోతున్న రైతులు జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. ప్రస్తుతం ఒక్క ఎకరాకు రూ.40లక్షల నుంచి రూ.కోటి వరకు డిమాండ్ ఉందని, క్రయవిక్రయాలు సైతం ఉన్నాయని, రోడ్డులో నష్టపోతున్న రైతులు ప్రభుత్వం ఇచ్చే పరిహారంతో వేరోక చోట భూమి కొనుగోలు చేసే పరిస్థితి లేదని తెలిపారు.

# గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్

నస్పూర్: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు గైర్హాజరు శాతాన్ని తగ్గించుకొని, హాజరుశాతాన్ని పెంపొందించుకోవాలని శ్రీరాంపూర్ ఎస్‌ఓటు జీఎం వి.పురుషోత్తం రెడ్డి అన్నారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఐకే 1ఏ గనిలో పనిచేస్తూ 2023లో 100మస్టర్లు, 2024 మే వరకు 50మస్టర్లు నిండని కార్మికులకు గురువారం ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఓ టు జీఎం మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ కార్మికుల సౌకర్యార్థం అనేక సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. ప్రతీ కార్మికుడు ప్రతీ నెల 20మస్టర్లు తగ్గకుండా హాజరుకావాలని సూచించారు. కాగా కౌన్సెలింగ్‌కు 70మంది కార్మికులు వారి కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, డీజీఎం పర్సనల్ పి.అరవిందరావు, అధికారులు చిరంజీవులు, డాక్టర్ పి.రమేశ్‌బాబు, రాజేష్, అజ్మీరా రమేష్, జోతి తదితరులు పాల్గొన్నారు.


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

# హామీలు అమలు చేసేందుకు కృషి

రెబ్బెన(ఆసిఫాబాద్): గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు దశలవారీగా అమలు చేసేందుకు కృషి చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. బెల్లంపల్లి ఏరియా కై రిగూడ ఓసీపీతోపాటు, గోలేటి సీహెచ్‌పీలో గురువారం నిర్వహించిన ఏఐటీయూసీ గేట్ మీటింగ్‌కు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కార్మికుల పిల్లల ఉద్యోగ అర్హతకు 35 సంవత్సరాల వయోపరిమితిని 40 ఏళ్లకు పెంచడం, గృహ నిర్మాణ రుణాలకు సంబంధించి వడ్డీ చెల్లింపులో కాలపరిమితి లేకుండా సమాన వడ్డీ చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకోవడం, కార్మికుల పిల్లలకు సీబీఎస్‌సీ విద్య అందించడం వంటి సౌకర్యాలు సాధించామని తెలిపారు. ఈ నెల నుంచి సీఎంపీఎఫ్ అన్ని రకాల లోన్లు వచ్చేలా యాజమాన్యంతో మాట్లాడామన్నారు. ఏరియా ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జూపాక రాజేష్, కిరణ్‌బాబు, జగ్గయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీతారామయ్య

## రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

నస్పూర్: సంస్థ ఉద్యోగులు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని డీఎంఎస్(మెకానికల్) సుధీర్ గణపతిరావు బన్సరే తెలిపారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియా సీసీసీ సింగరేణి గెస్టుహౌజ్‌లో మ్యాన్‌రైడింగ్ సిస్టం, ఫేస్ ఎక్విప్‌మెంట్, హాలర్స్ పనితీరుపై అధికారులకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో డీఎంఎస్(మెకానికల్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సేఫ్టీ మేనేజ్‌మెంటు ప్లాన్ రూల్‌బుక్‌లో తెలియజేసిన విధంగా రక్షణ సూత్రాలు పాటిస్తూ రక్షణ పరికరాలు ధరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దిలీప్‌కుమార్ డీడీఎంఎస్(మెకానికల్), కే.గురువయ్య, కార్పొరేట్ జీఎం మనోహర్, మందమర్రి జీఎం సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

మందమర్రిరూరల్: పట్టణంలోని మూడో జోన్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు తోట తిరుపతికి తీవ్ర గాయాలయ్యాయి. ఏరియాలోని పాలచెట్టు వద్ద గల ఎంవీటీసీలో శిక్షణ తరగతులకు హాజరై, తిరిగి తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా కాలనీలోని రోడ్డు మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో తిరుపతి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108ద్వారా మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించినట్లు సమాచారం.

## గంజాయి మొక్కల స్వాధీనం

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేకే-5 ఫిల్టర్ బెడ్ ఏరియాకు చెందిన కస్తూరి లింగయ్య ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రాజశేఖర్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. 13 గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కుమురంభీం థియేటర్ వెలవెల


ప్రేక్షకులు లేక ఖాళీగా థియేటర్

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాలో ప్రజలకు వినోదం పంచేందుకు 2022లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుమురంభీం సినిమా థియేటర్ ప్రేక్షకులు రాక వెలవెలబోతుంది. రెండు రోజులుగా ప్రేక్షకులు రాకపోవడంతో కనీసం ఒక్క షో కూడా వేయడం లేదు. టాప్ హీరోల సినిమా వస్తే తప్పా జనాల తాకిడి ఉండే అవకాశం లేదని నిర్వాహకులు పేర్కొంటున్నారు. కాగా.. ప్రస్తుతం జిల్లాలో పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కావడం, వ్యవసాయ పనులు జోరుగా సాగుతుండటంతో ప్రేక్షకులు సినిమాలు చూసేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

## 660 కిలోల బెల్లం పట్టివేత


పట్టుకున్న బెల్లంతో అధికారులు

చింతలమానెపల్లి(సిర్పూర్): మండలంలోని లంబాడిహేటిలో నాటుసారా తయారీ కోసం తరలిస్తున్న 660 కిలోల బెల్లాన్ని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానెపల్లి మండలం లంబడిహేటి గ్రామంలోని నాటుసారా తయారీదారులకు బెల్లం సరఫరా చేస్తున్నారనే ముందస్తు సమాచారంతో ఎక్సైజ్ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బెల్లం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. వాహనంతోపాటు బెల్లం స్వాధీనం చేసుకుని లంబాడిహేటికి చెందిన అజ్మీర సీతారాం, సైరి రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

# ఓల్డేజ్ హోంకు వృద్ధురాలి అప్పగింత

మంచిర్యాలటౌన్: జిల్లాలోని రామకృష్ణాపూర్‌కు చెందిన మేరీ ద్రాక్షవల్లి(70) తనను కొడుకు, ఇద్దరు కూతుళ్లు చూసుకోవడం లేదని జిల్లా మహిళా, శిశు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య ఆమె కొడుకు, ఇద్దరు కూతుళ్తో మాట్లాడారు. తమ తల్లిని చూసుకోలేమని చెప్పడం, ఆమె కూడా తనను ఓల్డేజ్ హోంలో చేర్పించాలని కోరడంతో గురువారం సఖి వాహనంలో హైదరాబాద్‌లోని గ్రాండ్ మా ఓల్డేజ్ హోంలో చేర్చారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ ఫర్హాన, మహిళా సాధికారిక హబ్ జెండర్ కోఆర్డినేటర్ సౌజన్య, టీం లీడర్ ప్రకాశ్ పాల్గొన్నారు.


ఓల్డేజ్ హోంలో చేరుస్తున్న సిబ్బంది

# సింగరేణి ఏరియా ఆసుపత్రిని కొనసాగించాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిని కొనసాగించడానికి సింగరేణి సీఅండ్ఎండీ వెంటనే చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. గురువారం సింగరేణి ఏరియా ఆసుపత్రిని ఆయన సందర్శించారు. మూసివేతకు గురైన వార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఏరియా ఆసుపత్రిని మూసి వేసేందుకు యత్నాలు చేయడం సరికాదని, ఆ తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో పని చేస్తున్న వేలాది మంది కార్మికులు బెల్లంపల్లిలో నివాసం ఉంటున్నారని అన్నారు. ఆసుపత్రిని మూసి వేయడం వల్ల కార్మికులు, కుటుంబ సభ్యులకు వైద్య సేవలు దూరమవుతాయని తెలిపారు. ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. ఆసుపత్రి మూసివేత చర్యలను కార్మికుల మద్దతుతో అడ్డుకుంటామని, తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.రాజ్‌కుమార్, సీనియర్ నాయకుడు చిప్పనర్సయ్య, బెల్లంపల్లి బ్రాంచ్‌కార్యదర్శి దాగం మల్లేష్, వైస్‌ప్రసిడెంట్ ఎస్.తిరుపతి, నాయకులు డీఆర్.శ్రీధర్, బయ్య మొగిలి, ఆడేపు రాజమౌళి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీతారామయ్య

# ఐకే1ఏ గనిని సందర్శించిన నాయకులు

జైపూర్: మండలంలోని ఇందారం ఐకే1ఏ గనిని ఏఐటీయూసీ గుర్తింపు సంఘం నాయకులు గురువారం సందర్శించారు. ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధానకార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యానికి ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికులకు మౌలిక వసతులు కల్పించడంలో లేదని, నాణ్యతతో కూడిన పనిముట్లు అందించాలని, వెంటిలేషన్ సమస్యను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, ఫిట్‌కార్యదర్శి అరిక రాజయ్య, తదితరులు ఉన్నారు.


కార్మికులతో మాట్లాడుతున్న వీరభద్రయ్య

# విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ

మంచిర్యాలఅర్బన్: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు టై, బెల్ట్, షూ, సాక్స్‌లు, స్కూల్ బ్యాగు అందించాలని ఉపాధ్యాయురాలు చట్టా జ్యోతి ఆలోచన చేసింది. తన సొదరుడు రెవరెండ్ ఫాదర్ రవికుమార్ సెయింట్ పెట్రోనెలా పారిష్ సభ్యుల సహకారంతో సుమారు రూ.5లక్షల విలువైన టై, బెల్ట్ స్నాక్స్, బ్యాగులు కొనుగోలు చేశారు. గురువారం జెడ్పీ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 350 మంది విద్యార్థులకు డీఈవో యాదయ్య చేతుల మీదుగా అంజేశారు. 10వ తరగతిలో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, నగదు పారితోషికం అందజేయడంపై ఆంగ్ల ఉపాధ్యాయిని జ్యోతిని అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌వోలు చౌదరి, సత్యనారాయణమూర్తి, హెచ్‌ఎం సుధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్కూల్‌బ్యాగు, స్టేషనరీ అందజేస్తున్న డీఈవో